
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కాకినాడ
జిల్లా వార్తలు
బుధవారం 21 ఫిబ్రవరి 2024 | 5



కన్నుల పండువగా అంతర్వేది లక్ష్మీనరసింహ స్వామివారి రథోత్సవం





- 7లో

అంతర్వేదిలో స్వామివారి రథోత్సవంలో పాల్గొన్న భక్తులు.. (ఇన్‌సెట్‌లో) దివ్య రథం

ఓట్ల కోసం.. 'మందు' చూపు



పాపులర్ బ్రాండ్లు

- అసెంబ్లీ ఎన్నికల ముంగిట జగన్ సర్కారు మద్యం మాయ
- హడావుడిగా పాపులర్ మందు బ్రాండ్లు రంగంలోకి దించిన వైనం
- కొత్తగా జిల్లాలోకి రాయల్‌స్టాగ్, బ్లెండర్‌స్ప్రైడ్, 100 పైపర్స్ బ్లాక్‌లేబుల్, రెడ్‌లేబుల్
- బీర్లలో ఎలిఫెంట్, హెన్‌కిన్ బ్రాండ్లు కూడా దుకాణాల్లో స్టాకుల ఏర్పాటు
- ఇన్నేళ్లుగా ఊరుపేరు లేని నాసిరకం బ్రాండ్లతో మందుబాబులను గుల్ల చేసిన ప్రభుత్వం
- ఇప్పుడు పాత బ్రాండ్లతో వ్యతిరేకత తగ్గించుకునేలా ఓట్ల గేలం
- ఈపాపులర్ బ్రాండ్లపై అప్పుడే కొందరు అధికారపార్టీ నేతల కన్ను
- ముందునుంచే భారీగా కొనుగోలు చేసి ఎన్నికల్లో పంపిణీకి ప్లాన్

(కాకినాడ, ఆంధ్రజ్యోతి)

అసెంబ్లీ ఎన్నికలు ముంచుకొస్తున్న వేళ జగన్ సర్కారుకు మందు బాబులపై హఠాత్తుగా ప్రేమ పొంగుకొచ్చింది. అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఇంతవరకు ఊరు, పేరు లేని నాసిరకం బ్రాండ్ల విక్రయిస్తూ ప్రజల ఆరోగ్యాలను గుల్ల చేసిన ప్రభుత్వం ఇప్పుడు కొత్తగా పాపులర్ బ్రాండ్లను రంగంలోకి దించుతోంది. ఎన్నికలవేళ మందు బాబులను మచ్చిక చేసుకుని ఓట్లు కొల్లగొట్టేందుకు పన్నాగం పన్నుతోంది. ఇందులోభాగంగా ఇంతకాలం అందరూ మర్చిపోయిన పాత పాపులర్ బ్రాండ్లను ఏరికోరి మద్యం దుకాణాల్లో అందుబాటులోకి తెస్తోంది. తాజాగా జిల్లాలోకి రాయల్‌స్టాగ్, బ్లెండర్ స్ప్రైడ్, 100పైపర్స్, బ్లాక్ లేబుల్, రెడ్‌లేబుల్ తదితర విస్కీ బ్రాండ్లను అమ్మకానికి దించింది. బీర్లలో ఎలిఫెంట్, హెన్‌కిన్ బ్రాండ్లు కూడా దుకాణాల్లో విక్రయాలకు సిద్ధం చేసింది. తద్వారా ప్రభుత్వం ఇంతకాలం చెత్త బ్రాండ్లను అంటగట్టి అడ్డగోలుగా దోచేసుకుందన్న మందుబాబుల ఆగ్రహంనుంచి కొంతైనా తప్పించుకునే వ్యూహం అమలు చేస్తోంది. మరోపక్క ఎన్నికలకు ఇంకా రెండు నెలల వ్యవధి కూడా లేనందున అప్పుడే జిల్లాలో కొందరు అధికార పార్టీ నేతలు ఈ బ్రాండ్లపై కన్నేశారు. ఎన్నికల్లో పంపిణీ కోసం భారీఎత్తున స్టాక్‌ను కొనుగోలు చేసి తరలించేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

ఓట్ల గేలానికే..

వైసీపీ అధికారంలోకి రాకముందు మద్య నిషేధం అమలు చేస్తామని హామీ ఇచ్చింది. తీరా గద్దెనెక్కిన తర్వాత సీఎం జగన్ ఏకంగా మద్యం విక్రయాలను పూర్తిగా పెంచేశారు. అప్పటివరకు రాష్ట్రంలో ఉన్న పాపులర్ బ్రాండ్లన్నింటినీ నిషేధించేశారు. ఆ స్థానంలో తమకు కావాల్సిన తమ పార్టీ అనుచరులకు చెందిన కంపెనీల్లో తయారైన నాసిరకం మద్యాన్ని ప్రభుత్వదుకాణాల్లో అందుబాటులో ఉంచారు. అవికూడా ఊరుపేరు లేని బ్రాండ్లకు పాపులర్ మద్యం కంటే అధిక ధరలను నిర్దేశించి విక్రయాలు జరిపారు. ఇలా జిల్లాలో నాలుగున్నరేళ్లుగా పూర్తిగా ఆరోగ్యాలను గుల్ల చేసే నాసిరకం మద్యాన్ని మందుబాబులకు దుకాణాల ద్వారా అంట గట్టారు. అటు మందుబాబులు సైతం చేసేది లేక ఈ మద్యాన్ని రెట్టింపు ధరకు కొనుగోలు చేసేలా చేశారు. ఇప్పుడు అసెంబ్లీ ఎన్నికలు సమీపిం చాయి. ఇంకా ఎన్నికలకు వారాల వ్యవధే ఉంది. ఈ నేపథ్యంలో మందు బాబులనుంచి ప్రభుత్వానికి వ్యతిరేకంగా భారీగా ఓట్లు పడతాయని ఐ ప్యాక్ సర్వేలో కూడా తేలింది. అందుకోసం ఇప్పటికప్పుడు పాత పాపులర్ బ్రాండ్లను మళ్లీ విక్రయిస్తే కొంతలో కొంతైన మందుబాబుల నుంచి వ్యతిరేకత తగ్గుతుందని జగన్ సర్కారు భావించింది. ఈ నేపథ్యంలో తాజాగా పాత బ్రాండ్లను జిల్లాలో ప్రభుత్వ మద్యం దుకాణాల ద్వారా అందుబా టులోకి తీసుకువచ్చింది. ట్రక్కుల్లో జిల్లాకు స్టాకును పంపుతోంది. ప్రధానంగా విస్కీ విషయానికి వస్తే బ్లెండర్‌స్ప్రైడ్, రాయల్ స్టాగ్, 100పైపర్స్, టీచర్స్ స్కాచ్, రెడ్‌లేబుల్, బ్లాక్‌లేబుల్ వంటి పాపులర్ బ్రాండ్లను దుకాణాల్లో విక్రయానికి ఉంచింది. వీటిలో ఫుల్, ఆఫ్‌తోపాటు నిబ్‌లు కూడా అమ్మకానికి ఉంచింది. వాస్తవానికి వైసీపీ అధికారంలోకి వచ్చినప్పటినుంచి ఇప్పటివరకు ఈ ప్రముఖ బ్రాండ్లను ప్రభుత్వం అమ్మకానికి ఉంచలేదు. ఇప్పుడు ఎన్నికల నెపంతో వీటిని దుకాణాల్లో స్టాక్ పెంచుతోంది. ఇప్పటివరకు జిల్లాకు మూడు ట్రక్కుల్లో సరుకు చేరింది. బీర్లు కూడా నాసిరకానికి చెందిన బూంబూంతోపాటు మరికొన్ని ఎవరికీ తెలియని బ్రాండ్లను ఇంతకాలం అమ్మగా ఇప్పుడు కొత్తగా జిల్లాలోకి ఎలిఫెంట్ బీర్‌ను అమ్మకాలకు ఉంచింది. దీని ధర రూ.260. హెన్‌కిన్ అనే టిన్ బీర్‌ను రూ.180కి విక్రయిస్తోంది. మార్చినుంచి కూడా మరికొన్ని పాపులర్ బ్రాండ్లను ఇంకా దించబోతోంది.

యానాంనుంచి పాపులర్ బ్రాండ్లు..

ప్రధానంగా బీర్ల విషయానికి వస్తే బూంబూం, ప్రెసిడెంట్ మెడల్ ఇలా.. ఎవరికీ తెలియని నాసిరకం మద్యం విక్రయించారు. అయినా చేసేదిలేక మందుబాబులు ఇదే కొనుగోలు చేసి తాగారు. ఈ నేపథ్యంలో జగన్ ప్రభుత్వం నాసిరకం మద్యంతో జిల్లాలో అమ్మకాలను అడ్డగోలుగా పెంచుకుంది. నెలకు జిల్లాలో 157 మద్యం దుకాణాల ద్వారా సరాసరి రూ.95కోట్లకుపైగా విక్రయాలు చేపట్టింది. ఏడాదికి విక్రయాలు రూ.925కోట్లకుపైగానే సాగాయి. జగన్ సర్కారు విక్రయిస్తున్న నాసిరకం మద్యం సేవించలేక అనేకమంది కొన్నేళ్లుగా అక్రమంగా తెలంగాణ, పక్కనే ఉన్న యానాంనుంచి పాపులర్ మద్యం బ్రాండ్లను గుట్టుగా జిల్లాకు తరలిస్తున్నారు. ఇక్కడ రహస్యంగా రెట్టింపు రేట్లకు అమ్మకాలు చేస్తున్నారు. కొందరు అధికార పార్టీ నేతలైతే హైదరాబాద్, భద్రాచలం, యానాం తదితర ప్రాంతాలనుంచి గుట్టుగా మద్యం తరలిస్తూ భారీగా సంపాదించారు. ఈ నేపథ్యంలో గతేడాదినుంచి జిల్లాలో తెలంగాణ, యానాం మద్యం అక్రమ లభ్యత పెరిగింది.

అప్పుడే కన్ను..

అసెంబ్లీ ఎన్నికలకు ఇంకా వారాల వ్యవధే ఉంది. మరోపక్క జగన్ ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత నెలకొంది. జనం వద్దకు వెళ్లిన వైసీపీ నేతలకు ఎక్కడికక్కడ నిలదీతలు ఎదురవుతున్నాయి. ఈ నేపథ్యంలో ఈ దఫా ఫ్యాన్‌కు ఎదురుగాలి తప్పేలా లేదని వైసీపీ జిల్లా, నియోజకవర్గ కీలక నేతలు, క్యాడర్ ఆందోళన చెందుతున్నారు. ఈ నేపథ్యంలో ఎన్నికల్లో భారీగా డబ్బు, మద్యం పంపిణీకి ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ప్రధానంగా ఇన్నేళ్లుగా జిల్లాలో నాసిరకం తాగిన మందు బాబులకు పాత పాపులర్ బ్రాండ్లను పంపిణీ చేసి ఓట్లకు గేలం వేయవచ్చని భావిస్తున్నారు. ఇందుకోసం తాజాగా దిగిన పాపులర్ బ్రాండ్లపై ఎక్కడికక్కడ నియోజకవర్గాల్లో అప్పుడే కన్నేశారు. వీటిని భారీగా నిల్వ చేసి ఎన్నికల్లో పంపిణీ చేసేందుకు వీలుగా ఇప్పటినుంచే స్టాకును పెద్ద ఎత్తున కొనుగోలు చేయడం మొదలుపెట్టారు. వాస్తవానికి ఈ బ్రాండ్లు దిగకముందు పలువురు అధికారపార్టీ నేతలు యానాం మద్యంపై కన్నేసి రకరకాల మార్గాల్లో కొంత రప్పించారు. ఇప్పుడు జిల్లాలో కూడా అందుబాటులో ఉండడంతో కొనుగోలు చేస్తున్నారు. కోడ్ అమల్లోకి వస్తే మద్యం రవాణా, నిల్వలు, కొనుగోలుపై నిఘా ఉండనుంది. ఈ నేపథ్యంలో ఇప్పుడు సదరు నేతలు ముందుచూపుతో స్టాకు సిద్ధం చేసుకుంటున్నారు.

జర్నలిస్టులపై దాడి ప్రజాస్వామ్యానికే ముప్పు

- ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్‌పై దాడికి నిరసనగా పెద్దాపురంలో ధర్నా



పెద్దాపురం ఆర్డీవో సీతారామారావుకు వినతిపత్రం అందజేస్తున్న పాత్రికేయులు

పెద్దాపురం, ఫిబ్రవరి 20: పాలకులు జర్నలిస్టులపై దాడులకు పాల్పడడం ప్రజాస్వామ్య వ్యవస్థకే ముప్పు అని పలువురు పాత్రికేయులు అన్నారు. అనంతపురం జిల్లా రాప్తాడు సిద్ధం సభలో ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై జరిగిన దాడికి నిరసనగా పెద్దాపురం ఆర్డీవో, డీఎస్పీ కార్యాలయాలవద్ద పెద్దాపురం నియోజకవర్గ పాత్రికేయులు మంగళవారం ధర్నాకు దిగారు. దాడికి పాల్పడిన వారిపైనా, ప్రేరేపించిన వారిపైనా కఠిన చర్యలు తీసుకోవాలని పాత్రికేయలు డిమాండ్ చేశారు. అనంతరం ఆర్డీవో సీతారామారావు, డీఎస్పీ లతాకుమారికి వినతిపత్రాన్ని అందచేశారు. కార్యక్రమంలో పెద్దాపురం నియోజకవర్గ పాత్రికేయులు పాల్గొన్నారు.

ప్రత్తిపాడులో జర్నలిస్టుల ఆందోళన



ప్రత్తిపాడులో డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న జర్నలిస్టులు

ప్రత్తిపాడు, ఫిబ్రవరి 20: రాప్తాడులో ఆంధ్రజ్యోతి స్టాఫ్ ఫొటోగ్రాఫర్‌పై వైసీపీ నాయకుల దాడి ఘటనను నిరసిస్తూ ప్రత్తిపాడులో జర్నలిస్టులు మంగళవారం ఆందోళన నిర్వహించారు. ప్రత్తిపాడు నియోజకవర్గ ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా యూనియన్ జర్నలిస్టులు తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ఫొటోగ్రాఫర్‌పై వైసీపీ మూక దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయ పరిపాలనాధికారి పుణ్యవతికి వినతిపత్రం అందజేశారు.

సీఆర్‌పీఎఫ్ హెడ్‌కానిస్టేబుల్‌కు ఎస్పీ పరామర్శ

- గన్‌మిస్‌ఫైర్ అయి గాయాలు.. జీజీహెచ్‌లో చికిత్స



చరణ్‌ను పరామర్శిస్తున్న ఎస్పీ సతీష్‌కుమార్

కాకినాడ క్రైం, ఫిబ్రవరి 20: ప్రమాదవశాత్తూ గన్ మిస్ ఫైర్ అయ్యి తీవ్రంగా గాయపడి కాకినాడ జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న ఓ కానిస్టేబుల్‌ను ఎస్పీ సుబ్రమణి సతీష్‌కుమార్ మంగళవారం పరామర్శించారు. తమిళనాడు రాష్ట్రానికి చెందిన 47ఏళ్ల పంచత్ చరణ్ సీఆర్‌పీఎఫ్ హెడ్‌కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నాడు. కాగా అతడు మావోయిస్ట్ ప్రభావిత ప్రాంతమైన చింతూరులో ప్రస్తుతం విధులు నిర్వర్తిస్తున్నాడు. ఈ క్రమంలో చరణ్ ఆదివారం రాత్రి విధి నిర్వహణలో ఉండగా ప్రమాదవశాత్తూ మెట్లపై నుంచి జారిపడడంతో అతడి చేతిలో ఉన్న తుపాకీ మిస్‌ఫైర్ అయ్యింది. దీంతో బుల్లెట్ అతడి ఎడమ ఛాతీ కింద భాగంలో దిగింది. అది గమనించిన సహచర పోలీస్ సిబ్బంది క్షతగాత్రుడిని హుటాహుటిన స్థానిక ఏరియా ఆస్పత్రికి తరలించగా ప్రథమ చికిత్స అందజేశారు. అనంతరం అక్కడి వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం నిమిత్తం సోమవారం చరణ్‌ను కాకినాడ జీజీహెచ్‌కు తరలించారు. అక్కడ వైద్యులు క్షతగాత్రుడికి శస్త్రచికిత్స నిర్వహించి బుల్లెట్‌ను తొలగించారు. అనంతరం సర్జికల్ ఇన్‌టెన్సివ్ కేర్ యూనిట్(ఎస్ఐసీయూ)లో చికిత్స పొందుతున్న చరణ్‌ను కాకినాడ జిల్లా ఎస్పీ మంగళవారం పరామర్శించి మెరుగైన వైద్యం అందజేయాల్సిందిగా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎంపీఆర్ విఠల్‌కు సూచించారు. ఎస్పీ వెంట డీసీఎస్ఆర్ఎంవో డాక్టర్ కోనాల అనిత, సీఐలు ఆకుల మురళీకృష్ణ, వాడవెల్లి సురేష్‌బాబు ఉన్నారు.

జిల్లా ఏపీ జేఏసీ ఆధ్వర్యంలో ఉద్యోగుల మహాధర్నా



కాకినాడ ధర్నాచౌక్‌వద్ద ఏపీజేఏసీ ఆధ్వర్యంలో ధర్నా చేస్తున్న ఉద్యోగులు

కాకినాడ సిటీ, ఫిబ్రవరి 20: ఉద్యోగుల డిమాండ్ల పరిష్కారంకోసం ఏపీజేఏసీ పిలుపు మేరకు మంగళవారం కాకినాడ ధర్నాచౌక్‌వద్ద జిల్లా ఏపీజేఏసీ ఆధ్వర్యంలో ఉద్యోగులు మహాధర్నా, ర్యాలీ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఏపీజేఏసీ చైర్మన్ గుద్దటి రామ్మోహన్‌రావు మాట్లాడుతూ ఉద్యోగులకు రావాల్సిన ఎస్ఎల్, జీపీఎఫ్ లోన్స్, ఏపీజీఎల్ఐ, డీఏ బకాయిలు విడుదల చేయాలని, 12వ పీఆర్సీ, 30శాతం ఐఆర్ వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏపీజేఏసీ కన్వీనర్ డీవీ రాఘవులు, ఏపీఎన్‌జీవో జిల్లా సహాయకార్యదర్శి పేపకాయల వెంకటకృష్ణ, రాష్ట్ర ఉపాధ్యక్షుడు పసుపులేటి శ్రీనివాసు, జిల్లాశాఖలనుంచి ట్రెజరీ సంఘం అధ్యక్షుడు పాము శ్రీనివాస్, జడ్పీ సంఘం అధ్యక్షుడు ఆర్వీ రమేష్, టీచర్ సంఘాల నాయకులు మోర్త శ్రీనివాస్, బి.మహేష్, దొరబాబు, కె.నగేష్, గోవిందరాజులు, ప్రదీప్, జిల్లా ఎన్‌జీవో సంఘం నాయకులు మట్లపర్తి వెంకటేశ్వరరావు, పాలపర్తి మూర్తి బాబు, సరెల్ల చంద్రరావు, కె.ప్రసాద్, డి.డేవిడ్ ఎలియాజర్, ఎన్.వీరబాబు, సత్తిరాజు, రామకృష్ణ, అజాజ్, బాషా పాల్గొన్నారు.

ముగిసిన పవన్‌కల్యాణ్ పర్యటన

- రాజమహేంద్రవరంలో సమీక్ష తర్వాత మంగళగిరి పయనం
- రాజమహేంద్రవరం రూరల్ టిక్కెట్ నాకే కన్ఫర్మ్ చేశారు: కందుల దుర్గేష్
- రాజానగరం అసెంబ్లీ సీటుపై రాని స్పష్టత



రాజమహేంద్రవరంలో సమీక్ష నిర్వహిస్తున్న పవన్

- 7లో

జీజీహెచ్‌లో సెంట్రల్ జైల్ ఖైదీ మృతి

కాకినాడ క్రైం, ఫిబ్రవరి 20: రాజమహేంద్రవరం సెంట్రల్ జైల్‌లో శిక్ష అనుభవిస్తున్న ఓ యావజ్జీవ ఖైదీ కాకినాడ జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందాడు. వివరాలిలా ఉన్నాయి. గుంటూరు జిల్లా గుంటూరు అర్బన్ ఆర్.అగ్రహారం పేటకు చెందిన అలాపాటి సాంబశివరావ్(85) 2019లో బాలికపై అత్యాచారానికి పాల్పడిన కేసులో నిందితుడు కావడంతో అతడికి కోర్టు జీవిత ఖైదు విధించింది. దీంతో అతడు 2021, జూలై 3వ తేదీ నుంచి రాజమహేంద్రవరం సెంట్రల్ జైల్‌లో శిక్ష అనుభవిస్తున్నాడు. అనారోగ్యానికి గురికావడంతో అతడిని ఇటీవల రాజమహేంద్రవరం గవర్నమెంట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ అతడి ఆరోగ్య పరిస్థితి మెరుగుపడకపోవడంతో అక్కడి వైద్యుల సూచన మేరకు ఎస్కార్ట్ పోలీసుల సహాయంతో ఈనెల 13న కాకినాడ జీజీహెచ్‌కు తరలించారు. ఇక్కడ చికిత్స పొందుతున్న సాంబశివరావు ఆరోగ్య పరిస్థితి విషమించడంతో మంగళవారం రాత్రి మృతి చెందాడు. కాకినాడ వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎన్నికల విధులు సక్రమంగా నిర్వహించాలి

- జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా

కాకినాడ సిటీ, ఫిబ్రవరి 20: శిక్షణలోని అంశాలను క్షుణ్ణంగా నేర్చుకుని వాటిని ఎన్నికల విధుల నిర్వహణలో సక్రమంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ కృతికాశుక్లా ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయంలోని విధాన గౌతమీ సమావేశమందిరంలో ఎన్నికల నోడల్‌అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, తహసీల్దార్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లకు ఐటీ అప్లికేషన్స్ నిర్వహణపై మంగళవారం ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ ఎన్నికల్లో ఈఎస్ఎంఎస్ ద్వారా మాత్రమే రిపోర్టులు, నివేదికలు పంపించాలని సూచించారు. గతంలో రిపోర్టులు మాన్యువల్‌గా పంపించేవారని, ప్రస్తుతం మాన్యువల్ విధానం లేదన్నారు. ప్రతి ఎన్నికల అధికారికి ఈఎస్ఎంఎస్ నిర్వహణకు ఒక లాగిన్ ఇస్తారన్నారు. ఆ లాగిన్ ద్వారానే ఆదేశాలు వస్తాయని, నివేదికలు కూడా పంపించాల్సి ఉంటుందని తెలిపారు. ఈఎస్ఎంఎస్ మొబైల్ యాప్ అని, గూగుల్ ప్లేస్టోర్ ద్వారా దీన్ని డౌన్‌లోడ్ చేసుకుని అధికారి హోదా, మొబైల్ నెంబర్ తదితర వివరాలను నమోదు చేసి లాగిన్‌ను ప్రారంభించాలని సూచించారు. ఎవరైనా ఈఎస్ఎంఎస్‌ను దుర్వినియోగం చేస్తే వారిపై చట్టపరమైన చర్యలు ఉంటాయని కలెక్టర్ హెచ్చరించారు శిక్షణ కార్యక్రమంలో ట్రైనింగ్ నోడల్ అధికారి నారాయణమూర్తి, ఐటీ నోడల్ అధికారులు సుబ్బారావు, ప్రసాదరావు, మున్సిపల్ కమిషనర్లు, తహసీల్దార్లు, వివిధ కార్యాలయాల డేటా ఎంట్రీ ఆపరేటర్లు, టెక్నీషియన్లు తదితరులు పాల్గొన్నారు.



నమూనా చెక్కు అందజేస్తున్న కలెక్టర్, ఎమ్మెల్సీ తదితరులు

'వైఎస్ఆర్ కల్యాణమస్తు' నిధుల విడుదల

- కలెక్టర్ కృతికాశుక్లా

కాకినాడ సిటీ, ఫిబ్రవరి 20: వైఎస్సార్ కల్యాణమస్తు, షాదీ తోఫా కింద గతేడాది అక్టోబరు-డిసెంబర్ త్రైమాసికానికి కాకినాడ జిల్లాలో వివాహం చేసుకున్న 367 జంటలకు రూ.2.66కోట్ల ఆర్థికసాయంగా లబ్ధి చేకూరుతోందని కలెక్టర్ కృతికాశుక్లా తెలిపారు. ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి క్యాంప్ కార్యాలయంనుంచి మంగళవారం బటన్ నొక్కి ఈ ఆర్థికసాయాన్ని తల్లుల ఖాతాల్లోకి విడుదల చేశారు. వర్చువల్‌గా జరిగిన ఈ కార్యక్రమానికి కాకినాడ కలెక్టర్ కార్యాలయంలోని వివేకానందహాల్‌నుంచి కలెక్టర్ కృతికాశుక్లా, ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, కుడా చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, డీఆర్డీఏ పీడీ శ్రీరమణి, మెప్మా పీడీ ప్రియంవద, సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పేద తల్లిదండ్రులు తమ పిల్లలను చదివించి వారి వివాహాలను గౌరవప్రదంగా జరిపేందుకు ఈ ఆర్థికసాయం తోడ్పడుతుందన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలు, దివ్యాంగులు, భవన నిర్మాణ కార్మికుల కుటుంబాల్లోని ఆడపిల్లల పెళ్లిళ్లకు ఈ సాయాన్ని ప్రభుత్వం అందిస్తోందన్నారు. పిల్లలు చదువుకోవాలనే ఉద్దేశ్యంతో ఈ పథకాలను పదోతరగతి ఉత్తీర్ణత, వధువుకు కనీస వయోపరిమితి 18ఏళ్లుగా, వరుడికి 21ఏళ్లుగా ప్రభుత్వం నిర్దేశించిందన్నారు. కార్యక్రమంలో ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.



వైభవంగా రథోత్సవం



భక్తజన సంద్రంగా అంతర్వేది

గోవింద నామస్మరణతో మార్మోగిన వీధులు

రథానికి తొలిపూజ చేసిన ఆలయ చైర్మన్

అంతర్వేది, ఫిబ్రవరి 20: గోవింద నామస్మరణలతో అంతర్వేది మార్మోగింది. పురవీధులు భక్తజన సమూహంతో నిండిపోయాయి. లక్షలాది మంది ముందు కదలగా శ్రీలక్ష్మీనరసింహస్వామివారి రథోత్సవం మంగళవారం వైభవంగా జరిగింది. మధ్యాహ్నం 2.46 గంటలకు రథోత్సవం ప్రారంభమైంది. స్వామివారి సోదరి అశ్వరూఢాంబిక(గుర్రాలక్కమ్మ)కు చీర, సారె లాంఛనప్రాయంగా తీసుకువెళ్లారు. ఆలయ ఫ్యామిలీ ఫౌండర్ మెంబర్, చైర్మన్ మొగల్తూరు రాజా కలిదిండి కుమారరామగోపాల రాజాబహదూర్ రథానికి తొలిపూజ చేశారు. అనంతరం కొబ్బరికాయ, గుమ్మడికాయ కొట్టి రథాన్ని ప్రారంభించారు. రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు, కలెక్టర్ హిమాన్షు శుక్లా, ఎస్పీ ఎస్.శ్రీధర్, డీసీ విజయరాజు, అమలాపురం ఆర్డీవో జి.కేశవర్ధనరెడ్డి కొబ్బరికాయలు కొట్టారు. ఆలయం నుంచి వేద పండితుల మంత్రోచ్చరణల నడుమ శ్రీలక్ష్మీనరసింహస్వామివారి ఉత్సవ మూర్తులను రథంపై కొలువు తీర్చి ఊరేగింపుగా గుర్రాలక్కమ్మ గుడికి తీసుకువచ్చారు. రాజావారి వీధి నుంచి ప్రారంభమైన రథయాత్ర పల్లపు వీధిలోని 16 స్తంభాల మండపానికి చేరుకోవడానికి సుమారు నాలుగు గంటలు సమయం పట్టింది. గోవింద, నరసింహ నామస్మరణలతో రథాన్ని భక్తులు లాగారు. భక్తులు రథానికి అరటి గెలలు, గుమ్మడికాయలు, వరి కంకులు కట్టారు. రథోత్సవం ప్రారంభంలో అధికార యంత్రాంగం అత్యుత్సాహం చూపించి సామాన్య భక్తులకు రథం తాడు లాగి దణ్ణం పెట్టుకునే అవకాశం కల్పించకపోవడంపై భక్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాగే భీష్మ ఏకాదశిని పురస్కరించుకుని తెల్లవారుజాము నుంచి అధిక సంఖ్యలో భక్తులు పుణ్యస్నానాలు ఆచరించారు. జంగమ దేవరులు పూరించిన శంఖాల ధ్వనితో సాగర సంగమ తీర ప్రాంతం మార్మోగింది. కార్యక్రమంలో డీఎస్పీ వెంకటరమణ, సీఐ గోవిందరాజు, ఎస్ఐ ఎస్.రాము, ఆలయ సహాయ కమిషనర్ వి.సత్యనారాయణ, వనమాలి మూలాస్వామి, వడుగు శ్రీను, తిరుమాని ఆచార్యులు, పోతురాజు శ్రీవెంకటకృష్ణ, కొపనాతి కృష్ణమ్మ కుటుంబీకులు, సర్పంచ్‌లు కొండా జాన్ బాబు, పోతురాజు నరసింహారావు (కిశోర్), ఎంపీటీసీ బైరా నాగరాజు పాల్గొన్నారు.



భవనాలపై నిల్చుని రథోత్సవాన్ని తిలకిస్తున్న భక్తులు



రథోత్సవానికి హాజరైన కలెక్టర్, ఎస్పీ తదితరులు

భక్తుల పుణ్యస్నానాలు

భీష్మ ఏకాదశి సందర్భంగా వేలాదిగా భక్తులు సముద్ర స్నానాలు చేసి స్వామివారి దర్శనం కోసం ఆలయం వద్ద క్యూలైన్‌లో సుమారు 500 మీటర్ల మేర బారులు తీరారు. క్యూలైన్‌లో కొద్దిసేపు భక్తులు కిక్కిరిసి కొంత సమయం అనంతరం స్వామిని దర్శనం చేసుకుని వెళ్లారు. స్వామివారి కల్యాణం తిలకించిన భక్తులు భక్తి పారవశ్యంతో పులకించారు. అంతర్వేదిలో బ్రహ్మదేవునిచే ప్రతిష్ఠింపబడిన క్షేత్రపాలకుడు నీలకంఠేశ్వర స్వామితో పాటు క్షేత్ర సంరక్షకుడు శ్రీఆంజనేయ స్వామి, శ్రీవశిష్ట ఆశ్రమం, గుర్రాలక్కమ్మ ఆలయాల్లో వేలాదిగా భక్తులు పూజలు చేశారు.

అక్షింతల కోసం..

అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి కల్యాణం అనంతరం తలంబ్రాలు బియ్యం కోసం భక్తులు బారులు తీరారు. క్యూలైన్‌లో స్వామివారి దర్శనం కోసం వెళుతున్న భక్తులకు దర్శనం అనంతరం అక్షింతలు పంపిణీ చేయాలని అధికారులు నిర్ణయించారు. ఉదయం సుప్రభాత సేవతో మొదలయ్యే దర్శన క్యూలైన్లలో భక్తులకు తలంబ్రాల అక్షింతలు పంపిణీ చేశారు.

నేటి కార్యక్రమాలు

బుధవారం సాయంత్రం 4 గంటలకు గజ వాహనంపై గ్రామోత్సవం నిర్వహిస్తారు. సాయంత్రం 7 గంటలకు అన్నపర్వత మహా నివేదన, రాత్రి 8 గంటలకు శృంగవరప్పాడు వాస్తవ్యులు రావి వెంకట సత్యనారాయణ, శ్రీహరిరావులచే నిర్మితమైన పొన్న వాహనంపై స్వామివారి గ్రామోత్సవం నిర్వహిస్తారని ఆలయ సహాయ కమిషనర్ వి.సత్యనారాయణ తెలిపారు.



పుణ్యస్నానాలు ఆచరిస్తున్న భక్తులు

కమనీయం

ద్రాక్షారామ భీమేశ్వరుని దివ్య కల్యాణం



జీలకర్ర బెల్లం చూపిస్తున్న పండితులు

పట్టువస్త్రాలు సమర్పించిన మంత్రి వేణు, కలెక్టర్ హిమాన్షు

ద్రాక్షారామ,ఫిబ్రవరి 20: ద్రాక్షారామ భీమేశ్వర స్వామివారి దివ్యకల్యాణ మహోత్సవం మంగళవారం రాత్రి ఘనంగా జరిగింది. మాఘ శుద్ధ ఏకాదశి ఆరుద్ర నక్షత్ర యుక్త తులా లగ్నమందు పుష్పాలంకృతమైన కల్యాణ వేదికపై మంగళ వాయిద్యాలు, వేదమంత్రాలతో జరిగిన భీమేశ్వర స్వామి, మాణిక్యాంబ అమ్మవారి పరిణయాన్ని భక్తులు తన్మయత్వంతో తిలకించారు. మూలవిరాట్టు శ్రీ భీమేశ్వర స్వామి, మాణిక్యాంబ అమ్మవార్లకు, క్షేత్ర పాలకులకు శ్రీలక్ష్మీ సమేత నారాయణస్వామి, శ్రీచండికా సమేత సూరేశ్వరస్వామికి ఏకకాలంలో జరిగిన కల్యాణ మహోత్సవాన్ని భక్తులు తిలకించారు. అంతకు ముందు నంది వాహనంపై నగరోత్సవం జరిగింది. అనంతరం కల్యాణ మూర్తులను అర్చకస్వాములు వేదమంత్ర పఠనం, మంగళ వాయిద్యాల నడుమ కల్యాణ వేదికపైకి తీసుకుని వచ్చారు.



కమనీయం.. కడు రమణీయం...

ఆలయ బ్రహ్మ దేవులపల్లి ఫణి రామకృష్ణ, వైదిక బృందం కల్యాణవేదికపై కల్యాణమూర్తులను అధిష్ఠింపజేసి కల్యాణం తంతు ప్రారంభించారు. సంకల్పం, గణపతిపూజ, పుణ్యాహవచనం అనంతరం కంకణధారణ జరిపించారు. తదుపరి స్వామివార్లకు సువర్ణ యజ్ఞోపవీత ధారణ జరిగింది. రాత్రి 10.25 గంటలకు కల్యాణమూర్తులు స్వామివార్లు, అమ్మవార్ల శిరస్సున అర్చకస్వాములు జీలకర్ర బెల్లం ఉంచి కల్యాణం జరిపించారు. అనంతరం మాంగల్యధారణ జరిగింది. ఆహ్లాదంగా ముత్యాల తలంబ్రాలు కార్యక్రమం జరిగింది. పునఃపూజ, నీరాజన మంత్రపుష్పాలు సమర్పించడంతో కల్యాణ మహోత్సవం తంతు ముగిసింది. భక్తులకు ముత్యాల తలంబ్రాలు స్వామి తీర్థప్రసాదాలు అందజేశారు..పలువురు దాతలు భక్తులకు స్వీట్లు పంపిణీ చేశారు.

పట్టువస్త్రాల సమర్పణ

టీటీడీ సమర్పించిన పట్టు వస్త్రాలను మంత్రి చెల్లుబోయిన వేణు దంపతులు, జిల్లా కలెక్టర్ హిమాన్షుశుక్లా పట్టు వస్త్రాలు అందించారు. స్వామి వారికి తిరుమల తిరుపతి దేవస్థానం పట్టు వస్త్రాలను సమర్పించింది. దేవదాయశాఖ ఇన్‌చార్జి ఆర్జేసీ ఎం.విజయరాజు, జిల్లా సహాయ కమిషనర్ డి.నాగమల్లేశ్వరరావు, దేవదాయ శాఖ తనిఖీదారు రాపాక బాలాజీరామ్‌ప్రసాద్, ఈవో పీటీవీ సత్యనారాయణ, వాడ్రేవు సుందరరత్నాకరరావు పాల్గొని స్వామివారి కల్యాణ మహోత్సవాన్ని తిలకించారు. కంచర్ల చక్రి స్వామివారికి 504 కిలోల లడ్డూ సమర్పించారు. మంగళవారం ఉదయం భీమేశ్వర స్వామికి ఏకాదశ రుద్రాభిషేకం ఘనంగా జరిగింది. గణపతిపూజ, మహాన్యాసం అనంతరం పంచామృతాలు, పండ్ల రసాలతో స్వామిని అభిషేకించారు. లక్ష రుద్రాక్షలతో పూజ నిర్వహించారు. అమ్మవారికి లక్ష కుంకుమార్చన జరిపారు.

శాస్త్రోక్తంగా వధూవరుల అలంకరణ...

ఉదయం 6.15 గంటలకు భీమేశ్వర స్వామి, మాణిక్యాంబ అమ్మవార్లను వధూవరులను చేశారు. శాస్త్రోక్తంగా ముత్తయిదువులు పసుపు దంచారు. అనంతరం కల్యాణ మూర్తులకు అర్చకస్వాములు మంగళస్నానం చేయించారు. వధూవరులుగా అలంకరించారు. స్వామి కల్యాణ మహోత్సవంలో భాగంగా సాయంత్రం 3.05 గంటలకు ముందుగా అంకురార్పణ, ధ్వజారోహణం జరిపారు. స్వామివారి కల్యాణ మహోత్సవం పురస్కరించుకుని పుష్పాలంకరణతో ఆలయం శోభాయమానంగా మారింది. ఆలయం, కల్యాణవేదిక పుష్పాలంకరణ ప్రత్యేకతగా నిలిచింది. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది భక్తులకు సేవలు అందించారు. సీఐ దొరరాజు ఆధ్వర్యంలో ద్రాక్షారామ పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

మళ్లీ పెద్దపులి అలజడి



చెరుకుమిల్లి శివారులో జాడలను పరిశీలిస్తున్న అధికారులు

దేవరపల్లి/గోపాలపురం, ఫిబ్రవరి 20: దేవరపల్లి మండలం బంధపురం గ్రామశివారు పోలవరం కాల్వగట్టు వద్ద పొగాకు తోటల్లో పులి సంచరించినట్టు అడుగులను రైతులు, గ్రామస్తులు గుర్తించారు. అటవీశాఖాధికారులకు విషయం తెలియజేయడంతో రాజమండ్రి ఫారెస్ట్ రేంజ్ ఏరియా ఆఫీసర్ ధనరాజు టీమ్ బంధపురం, పోలవరం గట్టు, పొగాకు, పామాయిల్ తోటల్లో పులిజాడలను గుర్తించారు. పులి సంచరిస్తుందని తెలియడంతో గ్రామస్థులు భయందోళనలో ఉన్నారు. ఫారెస్ట్ రేంజ్ ఏరియా ఆఫీసర్ ధనరాజు మాట్లాడుతూ పెద్దపులి ప్రస్తుతం దేవరపల్లి, గోపాలపురం మండలాల్లోని పెద్దాపురం, చెరుకుమిల్లి, బంధపురం, గ్రామాల మధ్య కుడికాల్వ ప్రాంతంలో ఉందని తెలిపారు. చిట్యాల, పెద్దాపురం, భీమోలు గ్రామాల ప్రజలను అటవీశాఖాధికారులు అప్రమత్తం చేశారు. సోమవారం సాయంత్రం పోలవరం మండలం వింజరం వద్ద ఉందని అంచనా వేయగా మంగళవారం ఉదయం దేవరపల్లి మండలం బంధపురం గ్రామశివారు వచ్చి తిరుగుముఖం పట్టిందని ప్రస్తుతం పెద్దపులి కదలికలను నిశితంగా పరిశీలిస్తున్నామని పోలవరం గట్టుపైన చెట్లకు ట్రాప్ కెమెరాలు అమర్చామని తెలిపారు. పాపికొండల అభయారణ్యంలోకి పులి చేరవచ్చని అంచనా వేస్తున్నట్లు చెప్పారు. చుట్టుపక్కల గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సాయంత్రం 5 దాటిన తర్వాత ఇంటికి పరిమితం కావాలని హెచ్చరికలు జారీ చేశారు. పొగాకు తోటల్లో ఆకురెల్పుకు వెళ్లే వారు జాగ్రత్తగా ఉండాలని, అవసరమైతే రెండురోజులు వాయిదా వేసుకోవాలని సూచించారు. సోషల్ మీడియాలో అసత్య ప్రచారాలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. డీఎఫ్ఆర్‌వో వేణుగోపాల్, ఎఫ్‌బీఓ సాత్విక్, శ్రీను, పోలవరం రేంజ్ సిబ్బంది, వన్యప్రాణి సంరక్షక సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన పవన్ పర్యటన



అభివాదం చేస్తున్న పవన్‌కల్యాణ్

సమీక్ష తర్వాత మంగళగిరి పయనం

రాజమహేంద్రవరం రూరల్ టిక్కెట్ నాకే: దుర్గేష్

రాజానగరం అసెంబ్లీ సీటుపై రాని స్పష్టత

రాజమహేంద్రవరం అర్బన్, ఫిబ్రవరి 20 : జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ రాజమహేంద్రవరం పర్యటన ముగిసింది. మంగళవారం ఏపీ అప్పారావు రోడ్డులోని గెయిల్ కార్యాలయం ఎదురుగా ఉన్న జనసేన పార్టీ కార్యాలయంలో మధ్యాహ్నం 12.30 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకూ అనపర్తి, రాజానగరం, రాజమహేంద్రవరం సిటీ, రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గాలకు చెందిన పార్టీ ఇన్‌చార్జులు, నాయకులతో పవన్‌కల్యాణ్ భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఆయా నియోజకవర్గాల్లో జనసేన పార్టీ పరిస్థితి, గెలుపు ఓటముల పై పవన్‌కల్యాణ్ పార్టీ నాయకులతో చర్చించినట్టు సమాచారం. ప్రధానంగా రాజమహేంద్రవరం రూరల్, రాజానగరం నియోజకవర్గాలపై ఆయన ఎక్కువగా ఫోకస్ పెట్టి వీటిపైనే ఎక్కువగా చర్చించినట్టు సమాచారం. రాజానగరం నియోజకవర్గం నుంచి జనసేన పార్టీ పోటీ చేస్తుందని ఇప్పటికే పవన్‌కల్యాణ్ ప్రకటించిన నేపథ్యంలో ఆ నియోజకవర్గంలో ఎవరిని పోటీలోకి దింపుతారనే ఆసక్తి సర్వత్రా నెలకొంది. అయితే రాజానగరం నియోజకవర్గ ఇన్‌చార్జిగా ఉన్న బత్తుల బలరామకృష్ణకు టిక్కెట్ ఖరారు చేస్తారని అంతా భావించినా అలా జరగలేదు. నియోజకవర్గంలో పరిస్థితిని మాత్రమే పవన్‌కల్యాణ్ చర్చించినట్టు తెలిసింది. ఇదే విషయాన్ని రాజానగరం నియోజకవర్గ ఇన్‌చార్జిగా ఉన్న బత్తుల బలరామకృష్ణ కూడా స్పష్టంచేశారు. అయితే రాజానగరం నియోజకవర్గం నుంచి జనసేన పార్టీ పోటీ చేస్తుందని పవన్‌కల్యాణ్ ప్రకటించడంతో టిక్కెట్ తనకే దక్కుతుందని భావిస్తున్నానని బలరామకృష్ణ చెబుతున్నారు. మరోపక్క రాజమహేంద్రవరం రూరల్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి జనసేన పార్టీ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కందుల దుర్గేష్ పోటీ ఖాయంగా కనిపిస్తోంది. నియోజకవర్గ పరిస్థితిపై పవన్‌కల్యాణ్‌తో సమావేశం తర్వాత కందుల దుర్గేష్ మాట్లాడుతూ రూరల్ నియోజకవర్గ టిక్కెట్ తనకు కన్‌ఫర్మ్ చేశారని స్పష్టం చేయడం గమనార్హం. ఇదిలాఉంటే, రాజమహేంద్రవరం వచ్చిన పవన్‌కల్యాణ్‌ను రాజమహేంద్రవరానికి చెందిన తెలుగుదేశం పార్టీ నాయకులు ఆదిరెడ్డి శ్రీనివాస్, అమలాపురం పార్లమెంటు నియోజకవర్గ నాయకులు హరీష్‌మాదుర్ తదితరులు కలిశారు. ఆదిరెడ్డి శ్రీనివాస్ సుమారు గంటసేపు పవన్‌కల్యాణ్‌తో భేటీ కావడం ప్రాధాన్యం సంతరించుకుంది. అనపర్తి, రాజానగరం, రాజమహేంద్రవరం సిటీ, రూరల్ నియోజకవర్గాలకు చెందిన జనసేన పార్టీ నాయకులు కూడా పవన్‌కల్యాణ్‌ను కలిశారు. కొవ్వూరు నియోజకవర్గానికి చెందిన కొందరు నాయకులు పవన్‌కల్యాణ్‌ను కలిసేందుకు రాజమహేంద్రవరం వచ్చారు. సమీక్షలు అనంతరం సాయంత్రం 4.30 గంటల సమయంలో పవన్ కల్యాణ్ బయలుదేరి వెళ్లారు. పవన్ కల్యాణ్ రాకతో జనసేన పార్టీ కార్యాలయం వద్దకు ఆయన అభిమానులు, పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో చేరుకున్నారు.

జీఎస్ఎల్‌లో ఏపీ మెడికోల క్రికెట్ టోర్నీ



రాజానగరం, ఫిబ్రవరి 20: డాక్టర్ వైఎస్సార్ హెల్త్ యూనివర్సిటీ పరిధిలోని మెడికల్ అండ్ డెంటల్ కళాశాలల పురుషుల క్రికెట్ క్రీడా పోటీలు రాజానగరం సమీపంలోని జీఎస్ఎల్ మెడికల్ కళాశాల క్రీడా ప్రాంగణంలో మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. జీఎస్ఎల్ వైద్య విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ గన్ని భాస్కరరావు క్రీడా పతాకాన్ని ఆవిష్కరించి, క్రీడా పోటీలను ప్రారంభించి, క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. ప్రభుత్వ, ప్రైవేటు మెడికల్, డెంటల్ కళాశాలల నుంచి 42 టీములు ఈ పోటీల్లో పాల్గొంటున్నట్టు ఆయన చెప్పారు. నాకౌట్ పద్ధతిలో ఈ నెల 25 వరకూ ఐదు రోజుల పాటు పోటీలు జరుగుతాయన్నారు. రానున్న రోజుల్లో రాత్రి సమయాల్లో సైతం క్రీడా పోటీలు నిర్వహించేలా ఫ్లడ్‌లైట్లు ఏర్పాటు చేసే యోచన ఉన్నట్లు డాక్టర్ భాస్కరరావు ఈ సందర్భంగా తెలిపారు. యూనివర్సిటీ స్పోర్ట్స్ కౌన్సిల్ సెక్రటరీ త్రిమూర్తులు మాట్లాడుతూ తొలిరోజైన మంగళవారం 16 జట్లు తలపడ్డాయన్నారు. దీనిలో భాగంగా మొదటి రోజు పోటీల్లో సిబార్ డెంటల్ కళాశాలపై సెయింట్ జోసెఫ్ డెంటల్ కళాశాల, నారాయణ డెంటల్ కళాశాలపై గుంటూరు మెడికల్ కళాశాల, విజయవాడ ప్రభుత్వ డెంటల్ కళాశాలపై కర్నూలు విశ్వభారతి మెడికల్ కళాశాల, నంద్యాల ప్రభుత్వ మెడికల్ కళాశాలపై కర్నూలు మెడికల్ కళాశాల గెలుపొందినట్టు త్రిమూర్తులు వివరించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ గురునాథ్, ఫిజికల్ డైరెక్టర్ శ్రీనివాసులు ఏర్పాట్లను పరిశీలించారు.

భక్తజనంతో రత్నగిరి కిటకిట



వ్రతమాచరిస్తున్న భక్తులు

అన్నవరం, ఫిబ్రవరి 20: భీష్మ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని సత్యదేవుడి సన్నిధి మంగళవారం అశేష భక్తజనంతో పోటెత్తింది సుమారు 7200 వ్రతాలు జరిగాయి. వివిధ విభాగాల ద్వారా సుమారు రూ.60 లక్షల ఆదాయం సమకూరింది. సోమవారం రాత్రికే భక్తులు చేరుకోగా ఒంటిగంట నుంచి వ్రతాలు, రెండు గంటల నుంచి సర్వదర్శనాలు ప్రారంభించారు. ఈవో రామచంద్రమోహన్ ఎప్పటికప్పుడు సీసీ కెమెరాల ద్వారా ఏర్పాట్లను పర్యవేక్షించారు. భీష్మ ఏకాదశి పర్వదినం సందర్భంగా ఆలయంలో పుష్పాలంకరణ విశేషంగా ఆకట్టుకుంది. రద్దీ నియంత్రణలో భాగంగా అంతరాలయ ప్రదక్షిణ టిక్కెట్ల విక్రయాలు నిలుపుదల చేశారు.

కులాల మధ్య ఐక్యతకు యువ నేతల కృషి అభినందనీయం

టీడీపీ యువ నేతలతో పవన్‌కల్యాణ్

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): 'కులాలను కలిపే ఆలోచనా విధానమనే మా సిద్ధం కోనసీమలో కార్యరూపంలోకి వచ్చింది. కులాల ఐక్యతకు కృషి చేస్తున్న యువనేతలందరికీ అభి నందనలు' అని పవన్‌కల్యాణ్ అన్నారు. రాజ మహేంద్రవరంలో మంగళవారం టీడీపీ నేతలు ఆదిరెడ్డి వాసు, గంటి హరీష్, వాసంశెట్టి సుభాష్, గంధం పల్లంరాజు, చిక్కాల గణేష్, యర్రంశెట్టి కాశీ, మండెల బాబీ తదితరులు పవన్‌ను కలిశారు. ఈ సందర్భంగా పవన్ మాట్లాడుతూ 'ఐక్యత ఒక్కరోజులో రాదు. ఇవాళ అందరూ ఒకతాటి మీదకు రావడం ఒక మార్పును సూచిస్తోంది' అని అన్నారు. కోనసీమలో కులాల మధ్య చిచ్చు పెట్టాలని వైసీపీ ప్రయత్నించినా సాధ్యం కాలేదన్నారు. వైసీపీ కుట్ర ఫలిస్తే రావణకాష్టం అయ్యేదన్నారు. కాపులు పెద్దన్న పాత్ర పోషించాలని తాను గతంలో రాజమహేంద్రవరంలోనే చెప్పానని, అన్ని వర్గాలను కలుపుకుని సోదరభావంతో ముందుకు వెళితే అది కచ్చితంగా గొప్ప సంకేతమవుతుందన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో కులాల ఐక్యత ప్రభావం కనిపిస్తుందని ఆయన చెప్పారు. సమావేశంలో పిఠాపురం ఇన్‌చార్జి తంగెళ్ల ఉదయ్‌శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

జనార్ధనస్వామి రథోత్సవం



రథోత్సవానికి హాజరైన భక్తులు

ధవళేశ్వరం, ఫిబ్రవరి 20: ధవళేశ్వరంలో జనార్ధనస్వామి రథోత్సవం మంగళవారం వైభవంగా జరిగింది. వందలాది మంది భక్తులు జయజయ జనార్ధన అంటూ రథాన్ని లాగారు. మంగళవారం మధ్యాహ్నం కొండపై నుంచి స్వామి, అమ్మవార్లను పల్లకిపై తీసుకువచ్చి రథంపై ఆసీనులు చేశారు. అనంతరం రథం ముందు కుంభం పోసి నైవేద్యంగా సమర్పించారు. మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ పూజలు చేసి రథోత్సవం ప్రారంభించారు. రథం పోలీస్‌స్టేషన్ వరకు వెళ్లి దిరిగి ఆలయం వద్దకు చేరుకుంది. రాత్రికి కొండపై స్వామి అమ్మవార్ల కల్యాణ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచి స్వామి వారి దర్శనానికి భక్తులు బారులు తీరారు. డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజు, హౌసింగ్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ షర్మిలారెడ్డి, జనసేన జిల్లా అధ్యక్షుడు కందుల దుర్గేష్ తదితరులు దర్శించి పూజలు నిర్వహించారు. వివిధ సంస్థల, సంఘాల ఆధ్వర్యంలో ప్రసాద వితరణ చేశారు. దక్షిణ మండలి డీఎస్పీ అంబికాప్రసాద్ ఆధ్వర్యంలో ధవళేశ్వరం సీఐ వినయ్‌మోహన్, పలువురు ఎస్ఐలు 100 మందికి పైగా సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి నాగ సురేష్ పర్యవేక్షణలో ఏర్పాట్లు చేశారు.

సాహస పోలీస్‌కు సత్కారం



శ్రీనివాసరావును అభినందిస్తున్న ఎస్పీ

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): పోలీసు ఉద్యోగమంటే కృతజ్ఞతలను సైతం కోరుకోకుండా ప్రతిక్షణం ప్రజల రక్షణ కోసమే పాటుపడే గొప్ప అవకాశమున్న ఉద్యోగమని ఎస్పీ జగదీశ్ అన్నారు. సమయస్ఫూర్తితో ఏడుగురి ప్రాణాలు కాపాడి ఆదర్శంగా నిలిచిన సాయుధ రిజర్వు విభాగం కానిస్టేబుల్ ఎస్.శ్రీనివాసరావును మంగళవారం ఆయన సత్కరించి ప్రశంసా పత్రాన్ని అందించారు. సోమవారం కోనసీమ జిల్లాలోని బెల్లంపూడి సెంటర్ వద్ద కారు అదుపు తప్పి బైక్‌ని ఢీకొట్టి కాల్వలోకి దూసుకెళ్లింది. కానిస్టేబుల్ శ్రీనివాసరావు తన బంధువుల ఇంటికి వెళ్లి తిరిగి వస్తుండగా ఈ ఘటన జరగడంతో కాల్వలోకి దూకి పీకలలోతు నీటిలోంచి ఇద్దరు పిల్లలు, ముగ్గురు మహిళలు, ఇద్దరు పురుషులను క్షేమంగా ఒడ్డుకు చేర్చారు. అడిషనల్ ఎస్పీ (శాంతి భద్రతలు) పి.అనీల్‌కుమార్, అడిషనల్ ఎస్పీ(ఏఆర్) ఎల్.చెంచిరెడ్డి, రిజర్వు ఇన్‌స్పెక్టర్ సంజీవ్‌కుమార్ తదితరులు శ్రీనివాసరావుకు అభినందనలు తెలిపారు.

కాకినాడ

• కాకినాడ సిటీ • రూరల్ • పిఠాపురం • పెద్దాపురం • తుని • ప్రత్తిపాడు • జగ్గంపేట

'మెరుగైన వైద్య సేవలందించాలి'

సర్పవరం జంక్షన్, ఫిబ్రవరి 20: గర్భిణులకు మెరుగైన వైద్య సేవలందేలా చర్యలు తీసుకోవాలని, రోగులకు నాణ్యమైన చికిత్సలు అందించాలని డీఎంహెచ్‌వో డాక్టర్ నరసింహనాయక్ కోరారు. మంగళవారం పండూరు పీహెచ్‌సీని ఆయన తనిఖీ చేశారు. పీహెచ్‌సీల్లో వైద్యులు సమయపాలన పాటించాలని, హైరిస్క్ గర్భిణుల ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఆసుపత్రి, మందుల రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.

'బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం'

గండేపల్లి, ఫిబ్రవరి 20: బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని, బాల్య వివాహాలు చేస్తే రూ.లక్ష జరిమానా, రెండేళ్ల జైలుశిక్ష విధిస్తామని లీగల్ ఆఫీసర్ ఎం.సుధాకర్ తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా స్త్రీశిశు అభివృద్ధి సంస్థ, డీఆర్‌డీఏ సంయుక్తంగా జిల్లాలో అన్ని మండలాల్లో వీవోలు, వీఏలకు బాల్య వివాహాల నిర్మూలన చట్టం, బాలబాలికల హక్కుల చట్టాలపై విస్తృత అవగాహన కల్పిస్తున్నారు. మంగళవారం జగ్గంపేట ఐసీడీఎస్ ప్రాజెక్టు ఎం.పూర్ణిమ ఆధ్వర్యంలో గండేపల్లిలో మహిళా సమాఖ్య సమావేశం ఏర్పాటు చేశారు. బాలబాలికలు ఎదుర్కొంటున్న సమస్యలు, సురక్షిత స్పర్శ, అసురక్షిత స్పర్శ వేధింపులకు గురైన బాలిక లక్షణాలు ఏవిధంగా ఉంటాయో వాటిని ఎలా గుర్తించాలో తెలియజేశారు. కౌన్సిలర్ బి.దుర్గారాణి, డీఆర్‌డీఏ ఏపీఎం సన్యాసిరావు, ఐసీడీఎస్ ప్రాజెక్టు సూపర్‌వైజర్ కరినున్నిష పాల్గొన్నారు.

కరప: బాల్య వివాహాలు చేసినా, వాటిని ప్రోత్సహించినా చట్టరీత్యా నేరమని ఐసీడీఎస్ సీడీపీవో లక్ష్మి అన్నారు. స్త్రీశక్తి భవనంలో వీవోలు, వీఏలు, అంగన్‌వాడీలకు మంగళవారం సమావేశం ఏర్పాటు చేశారు. బాలికలు వేధింపులకు లోనైతే వారి లక్షణాలు ఎలా ఉంటాయో, వారిని ఎలా గుర్తించాలో అవగాహన కల్పించారు. టీనేజ్‌లో వచ్చే గర్భం వల్ల పుట్టబోయే బిడ్డకు, తల్లికి ప్రమాదకరమన్నారు. ప్రొటెక్షన్ ఆఫీసర్ కె.శ్రీనివాసరావు, మహిళా సమాఖ్య అధ్యక్షురాలు గనికలక్ష్మి, డీఆర్డీఏ ఏపీఎం దేవి పాల్గొన్నారు.

'ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్‌పై దాడి హేయం'

సామర్లకోట, ఫిబ్రవరి 20: అనంతపురం జిల్లా రాప్తాడులో ఆదివారం సిద్ధం సభను కవర్ చేసేందుకు వెళ్లిన ఆంధ్రజ్యోతి స్టాఫ్ ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై వైసీపీ మూకలు పాశవికంగా దాడిచేయడం హేయమని సామర్లకోట భీమేశ్వరా జర్నలిస్టుల సంఘ అధ్యక్షుడు ఉప్పలపాటి చంద్రయ్యదాస్ అన్నారు. నిందితులను తక్షణం గుర్తించి అరెస్ట్ చేయాలని మంగళవారం డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా పలువురు జర్నలిస్టులు మాట్లాడుతూ సాక్షాత్తూ సీఎం సభలో జర్నలిస్టుపై దాడి జరిగితే ప్రభుత్వం తరపున ఒక్కరు కూడా ఖండించకపోవడం దారుణమన్నారు. ఈ ఘటనతో వైసీపీ నేతలకు జర్నలిస్టులపై ఉన్న గౌరవం ఏ పాటిదో మరోసారి తేటతెల్లం అయ్యిందని తెలిపారు.

తాళ్లరేవు: ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్‌పై దాడిచేసిన వారిని ప్రభుత్వం అరెస్టు చేయాలని తాళ్లరేవు జర్నలిస్టులు డిమాండ్ చేశారు. జర్నలిస్టుపై జరిగిన వైసీపీ దాడిని ఖండించారు. ప్రభుత్వం స్పందించి జర్నలిస్టులపై దాడులను అరికట్టాలన్నారు.

జగ్గంపేట: రాప్తాడులో ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్‌పై వైసీపీ మూకలు చేసిన దాడిని టీడీపీ నేత కొత్త వెంకటేశ్వరరావు తీవ్రంగా ఖండించారు. దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ దాడి ఒక అమానుష చర్యగా పేర్కొన్నారు.

'ఓటరు జాబితాలో అవకతవకలు సరిచేయాలి'

కాకినాడ సిటీ, ఫిబ్రవరి 20: కాకినాడ గ్రామీణ ప్రాంతాల ఓటరు జాబితాలో అనేక అవకతవకలున్నాయని, మరణించిన వ్యక్తుల పేర్లు, డబుల్ ఎంట్రీలు, ఫొటోలు లేని ఓటరు పేర్లు ఉన్నాయని, ఈ అవకతవకలను సరిచేయాలని కోరుతూ కాకినాడ రూరల్ జనసేన నాయకుడు పంతం సందీప్ మంగళవారం కాకినాడ ఆర్డీవో కార్యాలయంలో డిప్యూటీ తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పంతం సందీప్, కరెడ్ల గోవిందరాజు, బండారు మురళీ మీడియాతో మాట్లాడుతూ వెంటనే బూత్ లెవెల్ అధికారులను నియమించి విచారణ చేయించాలని విన్నవించామన్నారు. ఓటరు జాబితాలో ఏ తప్పులు దొర్లకుండా చూడాలని కోరామన్నారు. నాయకులు తాటికాయల వీరబాబు, సోదే మునలయ్య పాలెపు ఈశ్వర్, సునీల్ పాల్గొన్నారు.

'నిర్దేశించిన లక్ష్యాలు పూర్తి చేయాలి'

కరప, ఫిబ్రవరి 20: గ్రామ పంచాయతీలకు నిర్దేశించిన లక్ష్యాలు పూర్తి చేయాలని కాకినాడ డీఎల్‌పీవో టి.అన్నామణి ఆదేశించారు. మంగళవారం ఆమె స్థానిక గ్రామ పంచాయతీలో కార్యదర్శులు, గ్రామసచివాలయం, సిబ్బందితో సమావేశమై పలు అంశాలపై సమీక్ష జరిపారు. ఇంటి పన్నులు వసూళ్లపై దృష్టి సారించి నూరుశాతం పూర్తి చేయాలన్నారు. గ్రామాభివృద్ధి ప్రణాళిక రూపొందించాలన్నారు. పీఎం విశ్వకర్మ పథకంపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఇళ్ల పట్టాలు సకాలంలో రిజిస్ట్రేషన్లు అయ్యేలా చూడాలన్నారు. సచివాలయంలో రిజిస్ట్రేషన్ ప్రక్రియను పరిశీలించారు. గ్రామ కార్యదర్శి ఎస్‌కే నాగేంద్రకుమార్, వీఆర్వో ఏవీ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

తూతూ మంత్రంగా మండల సమావేశం

సర్పవరం జంక్షన్, ఫిబ్రవరి 20: కాకినాడ రూరల్ ఎంపీపీ గోపిశెట్టి పద్మజ అధ్యక్షతన మంగళవారం రమణయ్యపేట మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన సర్వసభ్యుల సమావేశం తూతూ మంత్రంగా సాగింది. సమావేశం అజెండా ఎంపీడీవో రమేష్‌నాయుడు సభ్యులకు వివరించారు. శాఖల వారీగా అభివృద్ధి పనుల నిర్వహణ, పురోగతిపై చర్చించేందుకు సంబంధిత అధికారులు ఎవరూ హాజరుకాకపోవడంతో మొక్కుబడిగా సమావేశం నిర్వహించారు. సమావేశంలో వైస్ ఎంపీపీ బి.విరీష, ఎంపీటీసీ నందిపాటి శ్రీనివాస్, నందిపాటి సత్తిబాబు, హౌసింగ్, ఇంజనీరింగ్ ఏఈ నాగభూషణరావు, వాసుదేవారావు తదితర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మంచినీటి పథకం ప్రారంభం

ప్రత్తిపాడు, ఫిబ్రవరి 20: పోతులూరు గ్రామంలో రూ.1.19కోట్లతో నిర్మించిన రక్షిత మంచినీటి పథకాన్ని మంగళవారం ఎమ్మెల్యే పర్వతప్రసాద్ ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పంచాది వీరబాబు, వాకపల్లి సర్పంచ్ రొంగలి నాగేశ్వరరావు, ఉప సర్పంచ్ బర్ల చక్రం, గుళ్ళ ఏడుకొండలు, మాజీ సర్పంచ్ ముడదారమణ, మాజీ ఎంపీటీసీలు నాగులాపల్లి బాబ్జి, పంచాది వీర సూర్యనారాయణ, వార్డు మెం బర్లు సిద్దా రాజా, మానుకొండ స్వామి, బుడంకాయల రాంబాబు, గ్రామస్తులు రేఖా కృష్ణార్జునుడు, కోలా అప్పారావు, ఆవాల చంద్రరావు, పంచాది సత్తిబాబు పాల్గొన్నారు.

స్పెషల్ ఎడ్యుకేషన్ బీఈడీలో అడ్మిషన్లు

సర్పవరం జంక్షన్, ఫిబ్రవరి 20: వాకలపూడి ఉమా ఎడ్యుకేషనల్ అండ్ టెక్నికల్ సొసైటీలో 2023-25 విద్యాసంవత్సరానికి బ్యాచులర్ ఆఫ్ ఎడ్యుకేషన్ స్పెషల్ ఎడ్యుకేషన్ బీఈడీ ఎస్ఈ (ఐడీడీ మరియు హెచ్ఐ)లో ప్రవేశానికి అడ్మిషన్లు కోరుతున్నట్టు ఆ సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎస్‌పి రెడ్డి తెలిపారు. రెండేళ్ల కోర్సులో న్యూఢిల్లీ రిహాబిలిటేషన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా అనుమతితో 2023-25 సంవత్సరానికి డిగ్రీలో స్పెషల్ ఎడ్యుకేషన్‌లో ప్రత్యేక విద్యలో ఉపాధ్యాయ శిక్షణకు గానూ అడ్మిషన్ ప్రారంభించామన్నారు. అలాగే ఉమా సంస్థ, ప్రత్యేక ఉపాధ్యాయ శిక్షణ కళాశాల, కాకినాలో మెంటల్ రిటార్డేషన్, ఏలూరులో వినికిడి సమస్య కోర్సుల్లోకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. డిగ్రీలో ప్రవేశానికి ఓసీ కేటగిరీకి 50 శాతం, బీసీ,ఎస్సీ, ఎస్టీలకు 45 శాతం మార్కుల ఉత్తీర్ణ సాధించినవారు అర్హులన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈనెల 28లోపు ఉమ వికాస కేంద్రంలో దరఖాస్తులు అందజేయాలన్నారు. 9440119828, 7981260637, 9491220349, 9704568159కు ఫోన్ చేసి సమాచారం పొందవచ్చని తెలిపారు.

గురుకుల పాఠశాలలో ప్రవేశానికి దరఖాస్తులు

పిఠాపురం, ఫిబ్రవరి 20: పట్టణంలోని జగ్గయ్యచెరువులో ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ శాఖ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాల, జూనియర్ కళాశాలల్లో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపాల్ తెలిపారు. ఐదోతరగతి దరఖాస్తు చేసే అభ్యర్థులు నాల్గో తరగతి ఉత్తీర్ణులై ఉండాలని, 2023-24 సంవత్సరంలో పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు ఇంటర్‌లో ప్రవేశానికి అర్హులని వివరించారు. ఇంటర్‌లో ఎంపీసీ, బైపీసీ గ్రూపులు అందుబాటులో ఉన్నట్టు తెలిపారు. ప్రవేశానికి దరఖాస్తు చేసుకునేవారు ఆన్‌లైన్‌లో ఈ నెల 23వ తేదీలోగా చేసుకోవాలని కోరారు.

వాలీబాల్ పోటీలు

గండేపల్లి, ఫిబ్రవరి 20: మల్లేపల్లిలో ప్రసన్న వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గత 3రోజులుగా వాలీబాల్ పోటీలు జరిగాయి. సోమవారం రాత్రి కూనవరం - కోలమూరు జట్ల మధ్య ఫైనల్స్ జరగగా కూనవరం విజేతగా నిలిచింది. రెండోస్థానం కోలమూరు, మూడోస్థానం నరేంద్రపురం, నాల్గోస్థానం మల్లేపల్లి జట్లు సాధించాయి. విజేతలకు నగదుతో పాటు ట్రోఫీని అందజేశారు. వెంకన్నబాబు, రామకుర్తి బ్రహ్మాజీ, బూర్లు సాయి, తాతీలు, ఆనంద్, గొర్రెల శివ, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

లారీ ఢీకొని వ్యక్తికి తీవ్ర గాయాలు

కాకినాడ రూరల్, ఫిబ్రవరి 20: లారీ ఢీకొన్న ఘటనలో ఓవ్యక్తికి చేయి విరిగి తలకు గాయం కావడంతో రక్తస్రావమైన సంఘటన ఇంద్రపాలెంలో మంగళవారం రాత్రి జరిగింది. రామేశ్వరానికి చెందిన వ్యక్తి కాకినాడ నుంచి సైకిల్‌పై ఆ గ్రామానికి వెళ్తుండగా ఇంద్రపాలెం నూకాలమ్మ గుడి వద్ద లారీ ఢీకొనడంతో తీవ్ర గాయాలయ్యాయి. సమాచారాన్ని పోలీసులకు తెలిపినా వారు సమయానికి అక్కడికి రాలేదు.

సినిమా గైడ్

కాకినాడ

ఆనంద్ సినిమాస్ 4 స్క్రీన్స్: ఈగల్, ఊరు పేరు భైరవకోన, మేడమిసెట్, గుంటూరుకారం, ట్రూలవర్

దేవీ మల్టీప్లెక్స్ 4 స్క్రీన్స్: ఈగల్, యాత్ర 2, ఊరు పేరు భైరవకోన, గుంటూరుకారం

తిరుమల	:	సూర్యసన్‌ఆఫ్‌కృష్ణన్, ఓయ్
లక్ష్మి	:	ఈగల్
సీ అండ్‌సీ1	:	ఈగల్
సీ అండ్‌సీ2	:	హనుమాన్
శ్రీప్రియ	:	అంబాజీ మ్యారేజిబ్యాండు
పద్మప్రియ	:	ఊరు పేరు భైరవకోన
సత్యగౌరి	:	ఊరు పేరు భైరవకోన
సూర్య 1	:	ఈగల్
సూర్య 2	:	ఊరు పేరు భైరవకోన

రేపు అరుణాచలానికి ఆర్టీసీ బస్సు సర్వీసులు

ప్రత్తిపాడు, ఫిబ్రవరి 20: ఏపీఎస్ ఆర్టీసీ ఏలేశ్వరం డిపో నుంచి ఈనెల 22న అరుణాచలానికి ప్రత్యేక ఆర్టీసీ బస్సు సర్వీసు నడుపుతున్నట్లు డిపో మేనేజర్ జీవీ సత్యనారాయణ తెలిపారు. యాత్రలో భాగంగా కాణిపాకం, శ్రీపురం, కంచిఅరుణాచలం, శ్రీకాళహస్తి,ద్వారకా తిరుమల క్షేత్రాలను సందర్శించడం జరుగుతుందన్నారు. రూ.3450 టిక్కెట్ ధరగా నిర్ణయించామని వివరాల కోసం 99592 25562లను సంప్రదించాలని డిపో మేనేజర్ తెలిపారు.

రాజధాని లేకుండా చేసిన సైకో సీఎం జగన్

» ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప » పలుచోట్ల వైసీపీ నుంచి టీడీపీలోకి చేరికలు



కొత్తపల్లి : టీడీపీలోకి ఆహ్వానిస్తున్న రాజప్ప, వర్మ

కొండెవరం (కొత్తపల్లి), ఫిబ్రవరి 20: ఒకసారి అవకాశమివ్వండని రాజధాని లేకుండా చేసిన సైకో ముఖ్యమంత్రి జగన్ అని మాజీ ఉప ముఖ్యమంత్రి, పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప అన్నారు. టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ ఆధ్వర్యంలో కొండెవరానికి చెందిన హెచ్‌పీ పెట్రోల్ బంక్ యజమాని చెలికాని జగదీష్ 200 అనుచరులతో భారీ ర్యాలీగా వెళ్లి మంగవారం టీడీపీలో చేరారు. జగదీష్‌కు రాజప్ప టీడీపీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం సమావేశంలో ఆయన మాట్లాడుతూ జగన్ సిద్ధం సభకు బస్సుల్లో జనాలను తరలిస్తున్నారన్నారు.



తుని : టీడీపీ కండువా కప్పుతున్న కృష్ణుడు



రౌతులపూడి : టీడీపీలో చేరినవారితో సత్యప్రభ

చంద్రబాబు సభకు ప్రజలు ఏ వాహనాలు లేకుండానే స్వచ్ఛందంగా హాజరవుతున్నారన్నారని తెలిపారు. చంద్రబాబు ఆధ్వర్యంలో టీడీపీ కార్యకర్తలు క్రమశిక్షణతో కార్యక్రమాల్లో పాల్గొంటున్నారని, రాబోయే రోజుల్లో వైసీపీని ప్రజలు బంగాళాఖాతంలో కలిపేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. వర్మ కార్యసాధకుడని, ఆయన లాంటి కార్యదీక్షాపరుడ్ని మళ్లీ ఎమ్మెల్యేగా సేవలందించేందుకు ప్రజలు దీవించాలన్నారు. తనను ఎమ్మెల్యేగా ఆశీర్వదించాలని ఐదేళ్లపాటు ప్రజలకు సేవలందిస్తానని వర్మ కోరారు. తొలుత వర్మ ఆధ్వర్యంలో సుమారు 4వేల మంది కార్యకర్తలు కొండెవరం వేంకటేశ్వరస్వామి ఆలయం నుంచి భారీ ర్యాలీ నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి, కొండెవరం సర్పంచ్ వేమగిరి చెల్లాయమ్మ, టీడీపీ మండ లాధ్యక్షుడు అనిశెట్టి సత్యానందరెడ్డి, కొండెవరం ఎంపీటీసీ దుళ్ళ సత్తిబాబు, మాజీ ఎంపీటీసీ గాది రాజబాబు, మాజీ జడ్పీటీసీ బత్తుల చైతన్యరాజేష్‌కుమార్, దళిత నేత వేమగిరి రాంబాబు ఉన్నారు.

తునిలో...

తుని రూరల్: వైసీపీకి చెందిన పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు గొల్లపల్లి ఈశ్వరరావు అనుచరగణంతో టీడీపీలోకి చేరారు. టీడీపీ మండలాధ్యక్షుడు అప్పన రమేష్ ఆధ్వర్యంలో తుని టీడీపీ కార్యాలయం నందు రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ యనమల కృష్ణుడు పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఆయన మాట్లాడుతూ కొత్తపాత విభేదాలు పక్కన పెట్టి సమష్టిగా పని చేసి తమ అభ్యర్థి దివ్యను అఖండ మెజార్టీతో గెలిపించుకోవాలన్నారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నేత పోల్నాటి శేషగిరిరావు, ఆత్మ కమిటీ మాజీ చైర్మన్ గొల్లపల్లి రాంబాబు, చామంతి సత్తిబాబు, పేరూరి కృష్ణ, పేరూరి కిషోర్, కొల్లు సత్తిబాబు, కోనా కన్నారావుల, పెద్ద ఎత్తున టీడీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

జల్దాంలో...

రౌతులపూడి: మండలంలో సబ్‌ప్లాన్ ఏజన్సీ గ్రామం జల్దాం పంచాయితీ పరిధి గ్రామాలకు చెందిన 100 కుటుంబాలు వైసీపీ కార్యకర్తలు, నాయకులు కోకూరి ధారపల్లి, బచ్చల వెంకటరమణ, బచ్చల ప్రసాద్, తల్లేపల్లి కృష్ణతో సహా 100 కుటుంబాలు ప్రత్తిపాడు టీడీపీ ఇన్‌చార్జి వరుపుల సత్యప్రభ ఆధ్వర్యంలో టీడీపీలో చేరారు. వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. జల్దాం పంచాయితీ పరిధిలో గ్రామాల్లో ఆమె పర్యటించారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక గిరిజన గ్రామాలు అభివృద్ధి కంటే గ్రామాల్లో ఖనిజ నిధులు దోచుకోవాడికే పని చేసిందని సత్యప్రభ అన్నారు. జనసేన- టీడీపీ ప్రభుత్వంలో గిరిజన గ్రామాలు అన్నివిధాల అభివృద్ధి చేసుకుందామన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు తమరాల సత్యనారాయణ, ఎంపీపీ గంటిమళ్ల రాజ్య లక్ష్మి, వెన్నా శివ, మాజీ ఎంపీపీ ఇటంశెట్టి సూర్య భాస్కరరావు మాజీ సర్పంచ్ పైల సాంబశివరావు, ఈగల సత్తిబాబు తదితరులు ఉన్నారు.

భీష్మ ఏకాదశి పూజలు



కరపలో వేణుగోపాలస్వామి

కరప, ఫిబ్రవరి 20: భీష్మ ఏకాదశి సందర్భంగా మండలం గ్రామాల్లోని విష్ణాలయాల్లో వెంకటేశ్వరస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. రామాలయాల్లో భజన బృందాలతో ఏకాహం నిర్వహించారు. కరప విష్ణాలయంలో అర్చకులు పెద్దింటి అనంతాచార్యులు, గోపాలకృష్ణ, యండమూరు వెంకటేశ్వర స్వామి ఆలయంలో అర్చకులు పెద్దింటి సీతారాములు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కరప కొత్తపేట రామాలయ కమిటీ ప్రతి ఇంటి గోడలపై ఓం శ్రీరామ అని రాయించి ప్రచారం నిర్వహించారు. కరప, కొరిపల్లి, జెడ్‌భావారం, గొడ్డటిపాలెం, గొర్రిపూడి తదితర గ్రామాల్లో నంది విగ్రహాల వద్ద పూజలు నిర్వహించి, గోల సంబరాలు, ఆర్కెస్ట్రా, కోలాటం వంటి సంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. యండమూరులో సామ్రాజ్యలక్ష్మి, గోదావరి సమేత వెంకటేశ్వరస్వామి దివ్య కల్యాణం మంగళవారం రాత్రి వైఖానస ఆగమ సిద్ధాంతం ప్రకారం వేడుకగా నిర్వహించారు.

సామర్లకోట: సామర్లకోటలో పురాతన ప్రసిద్ధి పొందిన మాండవ్య నారాయణస్వామి ఆలయంలో పండితులు చక్రవర్తుల ఆచార్యులచే స్వామివారికి, మహా లక్ష్మీదేవి అమ్మవారికి లక్ష తులసి అర్చన, సింధూరార్చన పూజలు నిర్వహించారు. పట్టణంలోని మహాలక్ష్మీగణపతి ఆలయంలో విశేష పూజలతో పాటు ఆలయ ఆవరణలో వీరవెంకటసత్యనారాయణ స్వామివారికి విశేష పూజలు నిర్వహించారు. సామర్లకోట ఉప్పు వారి వీధి రామాలయంలో ఏకాహపూజల్లో, అయోధ్యరామపురం ఎక్కిరాల రామస్వామి ఆచార్య వర్ధంతి ఆరాధనోత్సవాల్లో ఎమ్మెల్యే నిమ్మ కాయల చినరాజప్ప పాల్గొన్నారు.

జగ్గంపేట: గోకవరంరోడ్డులో శ్రీ ప్రసన్న ఆంజనేయ స్వామి, చెరువుగట్టుపై గల అభయ ఆంజనేయ స్వామి, గుర్రంపాలెం రోడ్‌లో గల ఆంజనేయ స్వామి ఆలయాల్ల ప్రత్యేక పూజలు జరిగాయి. ఉపసర్పంచ్ బండారు రాజా సత్య సదాశివరెడ్డి, ఎస్‌వీఎస్ అప్పలరాజు, పలువురు నాయకులు అధిక సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు.

తాళ్లరేవు: సీతారామపురం కాళభైరవస్వామి తీర్థం ఆలయకమిటీ ఆధ్వర్యంలో జరిగింది. భక్తులు స్వామికి భక్తులు పూజలు చేసేందుకు బారులు తీరారు. శ్రీగణేష్ మహాలక్ష్మి చేపల వర్తక సంఘం ఆధ్వర్యంలో అన్నదానం జరిగింది.

పిఠాపురం: పట్టణంలోని టీటీడీ నిర్వహణలోని వెంకటేశ్వరస్వామి ఆలయం, కుంతీమాధవస్వామి దేవస్థానం, రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయాల్లో స్వామి, అమ్మవార్లకు సహస్ర నామార్చనలు, విశేష పూజలు నిర్వహించారు.భక్తులు ఆయా ఆలయాలను దర్శించుకున్నారు.

ప్రత్తిపాడు: గజ్జెనపూడిలో తుని పంచముఖ ఆంజనేయ స్వామి ఆలయం వద్ద అష్టోత్తర తమలపాకుల, సింధూర పూజలు నిర్వహించారు. ప్రత్తిపాడు, ధర్మవరం, ఒమ్మంగి, ఉత్తరకంచి ఆలయాల వద్ద ఏకాదశి పూజలు నిర్వహించారు.

ఎప్పుడు పిలుస్తారోనని ఎదురుచూడాలా?

» కౌన్సిలర్ల తీవ్ర ఆగ్రహం » వాడివేడిగా గొల్లప్రోలు నగరపంచాయతీ సమావేశం



అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న వైస్‌చైర్మన్ తెడ్లపు అలేఖ్యరాణి, సభ్యులు

గొల్లప్రోలు, ఫిబ్రవరి 20: అజెండా రాత్రి 7గంటలకు పంపి ఉదయం సమావేశం ఉంది రమ్మంటారా, మీరు సమావేశానికి ఎప్పుడు పిలుస్తారోనని ఖాళీగా ఇంటి వద్ద కూర్చొని ఎదురు చూడాలా అంటూ కౌన్సిలర్లు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. గొల్లప్రోలు నగరపంచాయతీ కార్యాలయంలో చైర్‌పర్సన్ గంధ్రేటి మంగతాయారు అధ్యక్షతన మంగళవారం నిర్వహించిన అత్యవసర సమావేశం వాడివేడిగా జరిగింది. అధికారుల తీరుపై వైస్‌చైర్మన్ తెడ్లపు అలేఖ్యరాణి సహా అధికార వైసీపీ సభ్యులు నిప్పులు చెరిగారు. ఇలా అజెండాలు పంపే బదులు గోడకు అంటించేయండి అంటూ మండిపడ్డారు. సమావేశానికి 24గంటలు ముందు సమాచారం ఇవ్వాల్సి ఉందని, అయితే అనుకోకుండా ఆలస్యమైందని ఏఈ ప్రభాకర్ సమాధానం చెప్పేందుకు ప్రయత్నించగా అలేఖ్యరాణి, 16వ వార్డు కౌన్సిలరు జ్ఞానేశ్వరీ అభ్యంతరం తెలిపారు. 14, 15వ ఆర్థికసంఘం, ఇతరత్రా గ్రాంట్లు ద్వారా చేపట్టిన పనుల వివరాలు కావాలని గత సమావేశంలో అడిగామని, ఇప్పటి వరకూ ఎందుకు ఇవ్వలేదని అలేఖ్యరాణి, కౌన్సిలర్లు దమ్మాల లక్ష్మి, మొగలి జయబాబు ప్రశ్నించారు. వివరాలు ఎందుకివ్వలేదని అడిగితే 2రోజుల్లో కార్యాలయ పని వేళల్లో వచ్చి తీసుకోవాలని అని చెబుతారా అంటూ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అటువంటప్పుడు నగరపంచాయతీ కౌన్సిల్ సమావేశాలు పెట్టడం ఎందుకని నిలదీశారు. తాము కోరిన వివరాలు ఇవ్వనప్పుడు, కౌన్సిలర్లు కనీస విలువ ఇవ్వకపోతే ఇక తామెందుకని మండిపడ్డారు. 2రోజుల్లో ఇస్తామని ఏఈ తెలిపారు. జగనన్న కాలనీకి రోజూ 3ట్యాంకర్లు ద్వారా నీటిని పంపిస్తున్నామని అధికారులు చెబుతున్నారని, అయితే అక్కడకు రావడం లేదని ప్రజలు తెలుపుతున్నారని 3వ వార్డు కౌన్సిలరు మైనం భవానీ తెలిపారు. మున్సిపల్ వాటర్ ట్యాంకర్ల ద్వారా తాగునీటిని బయటకు విక్రయిస్తున్నారని మొగలి దొరబాబు ఆరోపించారు. తమ వార్డుల్లో గడపగడపకు ప్రభుత్వం కార్యక్రమం పూర్తయి పనులు మంజూరు చేసినా ఎందుకు చేపట్టడం లేదని 10,11వ వార్డుల కౌన్సిలర్లు మొగలి దొరబాబు, కూరాకుల శేఖర్ ప్రశ్నించారు. భవనాల నిర్మాణాలకు అనుమతులకు భారీగా సొమ్ములు డిమాండ్ చేస్తున్నారని బావిశెట్టి జ్ఞానేశ్వరీ ఆరోపించారు. అనధికారిక లేఅవుట్ల సమాచారం అడిగినా ఎందుకివ్వలేదని సభ్యులు ప్రశ్నించారు.

పేదలపై రాజకీయాలు చేస్తే చూస్తూ ఊరుకోం

మాజీ ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు



నిరసనకారులకు మద్దతు తెలిపిన దాట్ల

తాళ్లరేవు, ఫిబ్రవరి 20: చొల్లంగిలో పేదలపై అధికార పార్టీ ఎమ్మెల్యేలు రాజకీయాలు చేస్తే చూస్తూ ఊరుకోబోమని మాజీ ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు హెచ్చరించారు. సోమవారం ఆయన చొల్లంగి నిరసన దీక్షను సందర్శించి మద్దతు తెలియజేశారు. చొల్లంగిలో ఉన్న భూములను కాకినాడ నియోజకవర్గం వాళ్లకు ఇచ్చి ముమ్మిడివరం నియోజకవర్గ ప్రజలను అడవుల పాలు చేస్తుంటే స్థానిక ఎమ్మెల్యే పొన్నాడ ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. రాబోయే రోజుల్లో టీడీపీ, జనసేన కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తుందని వెంటనే చొల్లంగి స్థలాలను స్థానికంగా ఉన్న లబ్ధిదారులకే ఇచ్చిన తరువాత ఇతరులకు ఇస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే చెల్లి వివేకానంద, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గుత్తుల శ్రీనివాససాయి, మండల కార్యదర్శి కట్టా త్రిమూర్తులు, జిల్లా కార్యదర్శి మందాల గంగసూర్యనారాయణ, ఎస్సీసెల్ రాష్ట్ర అధ్యక్షుడు చెల్లి అశోక్‌కుమార్, గర్రే లక్ష్మీనారాయణ, మేడపాటి దేవా, ఈతమూడి రాఘవ తదితరులు ఉన్నారు.

మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం



అభివృద్ధి పనుల శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న వీసీ

జేఎన్టీయూకే, ఫిబ్రవరి 20: కాకినాడ జేఎన్టీయూకేలో మౌలిక వసతుల కల్పనకు అధిక ప్రాధాన్యమిస్తూ ప్రయోగశాలల నిర్మాణం, రూసా నిధులతో విభాగాలు, వసతిగృహాలను ఆధునికీకరించామని ఉపకులపతి ప్రొఫెసర్ జీవీఆర్ ప్రసాదరాజు తెలిపారు. సీఎస్ఈ విభాగంలో నూతనంగా నిర్మించిన సెమినార్ హాలు, ఐఎస్టీలోని అడ్వాన్స్‌డ్ నానోటెక్నాలజీ ల్యాబ్, నానో మెటీరియల్స్ స్టిములేషన్ ల్యాబ్‌లను, ఆధునికీకరించిన నరేంద్ర, నాగావళి వసతిగృహాలను వీసీ ముఖ్యఅతిథిగా ప్రారంభించారు. రెక్టార్ కేవీరమణ, రిజిస్ట్రార్ సుమలత, ఐఎస్టీ డైరెక్టర్ ప్రొఫెసర్ ఏ.గోపాలకృష్ణ, యూసీఈకే ప్రిన్సిపాల్ కృష్ణప్రసాద్, సీఈ శ్రీనివాసులు, డీఈఈ జి.మోహన్‌ప్రసాద్, ఏఈలు సన్నీ, ప్రదీప్ పాల్గొన్నారు.

యర్రంపాలెంలో ఆందోళన

గండేపల్లి, ఫిబ్రవరి 20: రైస్ మిల్లు నుంచి వచ్చే కాలుష్యంతో దగ్గు, ఉబ్బసం, ఆయాసం వంటి రోగాలకు గురవుతున్నామని తక్షణం దానిని తొలగించాలని మంగళవారం యర్రంపాలెంలో మహిళలు, గ్రామస్తులు ఆందోళనకు దిగారు. యర్రంపాలెంని ఆనుకుని సంవత్సరన్నర కిందట తిమ్మాపురం గ్రామానికి చెందిన ఒక రైస్ మిల్లు నిర్మించారు. దాని నుంచి బయటకు వచ్చే ఊక, తవుడు గ్రామంతా వ్యాపించి తినుబండార పదార్థాలు, గృహాలు, దుస్తులు, ఇతర సామాన్లపై దుమ్ముతో కమ్ముకుంటున్నాయని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేశారు. దీనిపై కార్యదర్శిని రవిప్రకాష్‌ను వివరణ కోరగా కాలుష్యం గ్రామాల్లో రాకుండా ఉన్నతాధికారులకు తెలియజేసి చర్యలు తీసుకుంటామని తెలిపారు. గ్రామస్తులు బిక్కిన కృష్ణ, మహిళలు ముత్యాల వరలక్ష్మి, ఎం.సత్యవతి, మంగ, వసంత, అనూరాధ, ఉమాలక్ష్మి పాల్గొన్నారు.

ఏవి నగరంలో వైభవంగా లక్ష తులసి పూజ



లక్ష తులసి పూజ చేస్తున్న యనమల దంపతులు

తొండంగి, ఫిబ్రవరి 20: మండలంలోని ఏవి నగరం గ్రామంలో శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరుని వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం లక్ష తులసి పూజను వైభవంగా నిర్వ హించారు. మండలి ప్రతిపక్ష నేత యనమల రామకృష్ణుడు,తుని ఇన్‌చార్జి యనమల దంపతులతో అర్చకులు పూజా కార్యక్రమాలను నిర్వహింపజేశారు. ఉదయం స్వామి వారిని సుప్రభాతంతో మేల్కొలిపి నవనీత హారతి సమర్పించారు. అష్టోత్తర శత కలశాలతో పవిత్ర వేదమంత్రాల నడుమ స్న పనాభిషేకం నిర్వహించారు. అనంతరం లక్ష తులసి పూజ జరిపారు. భక్తుల గోవింద నామస్మరణ నడుమ స్వామి అమ్మవార్ల దివ్యకల్యాణాన్ని జరిపారు. మహా సంప్రోక్షణ అనం తరం మహానారాయణ యాగం నిర్వహించి పూర్ణాహుతి సందర్భంగా పవిత్ర ద్రవ్యాలను హోమగుండంలో సమర్పించారు. సామూహిక రమా సత్యన్నారాయణ వ్రతాలు నిర్వహి ంచి వచ్చిన భక్తులకు మహాన్నదానం జరిపారు. అనంతరం స్వామి అమ్మవార్ల ఉత్సవ మూర్తులో రథోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. మాజీ హోం మంత్రి నిమ్మకాయల చినరాజప్ప, టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి యనమల కృష్ణుడు, యనమల నాగేశ్వరావు స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

'ప్రజల నడ్డి విరుస్తున్న వైసీపీ ప్రభుత్వం'



మాట్లాడుతున్న చప్పిడి వెంకటేశ్వరరావు

కాకినాడ సిటీ, ఫిబ్రవరి 20: సామాజిక న్యాయానికి సంకెళ్లు వేసి పన్నుల రూపంలో బాదుడు పాలనతో వైసీపీ ప్రభుత్వం ప్రజల నడ్డి విరుస్తోందని, వచ్చే ఎన్నికల్లో చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలని రాష్ట్ర ప్రజలందరూ ఎదురు చూస్తు న్నారని టీడీపీ ఆరోగ్య విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి, కాకినాడ రూరల్ సీనియర్ నాయకుడు డాక్టర్ చప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. మంగళవారం ఆయన పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ సంక్షేమం పేరుతో ప్రజలను మోసం చేస్తున్నారని, ఇక అభివృద్ధిని పూర్తిగా విస్మరించారన్నారు. 18నుంచి 50ఏళ్లలోపు ప్రతి మహిళకు నెలకు రూ.1500, ఏడాదికి ఉచితంగా 3 గ్యాస్ సిలిండర్లు పంపిణీ చేయనున్నారన్నారు. సమావేశంలో దేవు వెంకన్న, ప్రసాద్, వినాయక్, ఉపేంద్ర, నాగమణి, శ్యామల పాల్గొన్నారు.

వైభవంగా కేశవ, పట్టాభిరామస్వామి కల్యాణం



ప్రత్యేకాలంకరణలో కేశవ, పట్టాభిరామస్వామి

పెద్దాపురం, ఫిబ్రవరి 20: మండల పరిధిలోని అతి పురాతన లక్ష్మీదేవీ, భూదేవీ సమేత కేశవ స్వామి, సీతా సమేత, పట్టాభిరామ స్వామివార్ల దివ్య కల్యాణ మహోత్సవం మంగళవారం వైభవంగా నిర్వహించారు. ఉత్సవ మూర్తులను సర్వాంగ సుందరంగా అలంకరించారు. ఆలయ ఈవో కొట్నూ జగన్మోహన శ్రీనివాస్ ఆధ్వర్యంలో వేద పండితుల మంత్రోచ్చారణల నడుమ స్వామివారికి అభిషేకాలు, అర్చనలు, కుంకుమపూజలు, విశేషపూజలు, హోమాలు చేశారు. స్వామివార్ల విగ్రహాలను గరుడ, హనుమ వాహనాలపై మేళతాళాలు, మంగళవాయిద్యాల గ్రామోత్సవం నిర్వహించారు. అధికంగా భక్తులు పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామి దివ్య కల్యాణం

సామర్లకోట, ఫిబ్రవరి 20: మండలంలోని వేట్లపాలెంలో వేంకటేశ్వరస్వామి దివ్య కల్యాణ మహోత్సవం మంగళవారం రాత్రి వైభవంగా నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపకులు పెండ్యాల నాగేశ్వరరావు మాస్టారు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పూజల్లో పారిశ్రామికవేత్తలు మట్టే శ్రీనివాస్ విద్యుల్లత దంపతులు, నున్న రామకృష్ణవెంకటలక్ష్మి దంపతులు ఆశీనులయ్యారు. పండితులు వాడపల్లికి చెందిన మహాదాచార్య వాడపల్లి గోపాలచార్యులు కల్యాణం నిర్వహించారు. కొనసా హరిబాబు, బాబ్జీల బాణసంచా కాల్పులు ఆకట్టుకున్నాయి. పండితులకు పండిత సత్కారం నిర్వహించారు. కల్యాణంలో ఎమెల్యే చినరాజప్పతో పాటు గోలి ధర్మరాజు, నున్న నారాయణరావు, గోలి రవి, గోలి సోమేశ్వరరావు, గుమ్మళ్ళ సత్యనారాయణ, గుమ్మళ్ళ రాయన్న తదితరులు పాల్గొన్నారు.

ఉమారామలింగేశ్వరస్వామి కల్యాణం

రౌతులపూడి, ఫిబ్రవరి 20: రౌతులపూడి శివాలయం నందు ఉన్న శ్రీఉమారామలింగేశ్వరస్వామి కల్యాణాన్ని మంగళవారం వైభవంగా నిర్వహించారు. ముందుగా స్వామిఅమ్మవార్లకు రథంపై గ్రామోత్సవం నిర్వహించారు. రథాన్ని లాగేందుకు భక్తులు పోటీపడ్డారు. అడిగర్ల రామకృష్ణ కల్యాణ అన్నదానం నిర్వహించగా అధికంగా భక్తులు హాజరయ్యారు.

ఘనంగా వెంకన్న రథోత్సవం



గొల్లప్రోలులో వేంకటేశ్వరస్వామి రథోత్సవం

గొల్లప్రోలు, ఫిబ్రవరి 20: గొల్లప్రోలు రైల్వేస్టేషన్ వద్ద ఉన్న శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి రథోత్సవం మంగళవారం కనులపండువగా జరిగింది. పురవీధుల్లో స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను రథంపై ఉంచి ఊరేగించారు. అంతకు ముందు స్వామి,అమ్మవార్లను పెండ్లికుమారుడు, కుమార్తెగా అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనగా ఆలయకమిటీ సభ్యులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

అయ్యప్పస్వామి విగ్రహ ప్రతిష్ఠ

గొల్లప్రోలు రూరల్, ఫిబ్రవరి 20: గొల్లప్రోలు మండలం దుర్గాడ శివాలయంలో నూతనంగా నిర్మించిన హరిహరసుత శ్రీ అయ్యప్పస్వామి దేవాలయంలో విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. మహాగణపతి పూజ, విష్వక్సేన పూజ, పుణ్యాహవాచన, పంచగవ్యప్రాశన, గోపూజ, గ్రామ ప్రదిక్షణలు జరిగాయి. సాయంత్రం పంచగవ్య ఆరాధన, దీక్షాధారణ, యాగశాల ప్రవేశం, వాస్తుపూజ, హోమం, నవగ్రహారాధన, దిక్పాలరాధన నిర్వహించారు. కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఆర్యవటంలో అప్పన్నెద్దు మృతి

కాజులూరు, ఫిబ్రవరి 20: మండలంలో ఆర్యవటం గ్రామానికి చెందిన అప్పనబాబు (అప్పన్నెద్దు) మంగళవారం ఉదయం మృతి చెందింది. గ్రామంలో పదేళ్ల క్రితం వెంకటేశ్వరస్వామి ప్రతిరూపంగా గ్రామ వీధుల్లో తిరిగిన అప్పనబాబు ఆకస్మికంగా కాలం చేయడంతో గ్రామస్థులు అంత్యక్రియల్ని సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. గోవింద నామస్మరణతో గ్రామ వీధుల్లో ఊరేగించి అనంతరం మట్టిలో ఖననం చేశారు. గ్రామంలో విషాదచాయలు అలుముకున్నాయి.

పాతకొట్టాంలో పెంకుటిల్లు దగ్ధం

కోటనందూరు, ఫిబ్రవరి 20: మండలంలో పాతకొట్టాంలో విద్యుత్‌షార్టు సర్క్యూట్‌తో పెంకుటిల్లు దగ్ధమైంది. నక్కా కాశింబి ఇంటి దగ్గర ఎవరులేని సమయంలో ఘటన జరిగింది. ఇంట్లో వస్తువులన్నీ కాలిపోయాయి. సుమారు రూ.2లక్షలు ఆస్తినష్టం జరిగింది. రెవెన్యూ అధికారులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి ఉన్నాతాధికారులకు తెలిపారు.

80 లీటర్ల సారాతో వ్యక్తి అరెస్ట్

తుని రూరల్, ఫిబ్రవరి 20: తుని మండల శివారు డీజేపురంలో సారా కాపు కాసి తుని తరలిస్తుండగా రూరల్ పోలీసులు పట్టుకున్నారు. డీజేపురం గ్రామానికి చెందిన బొట్టా సత్తిబాబును 80లీటర్ల సారాతో పాటు ఒక ద్విచక్రవాహనాన్ని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్టు తుని రూరల్ ఎస్ఐ పి.రమేష్ బాబు తెలిపారు.

'సారాను నిర్మూలించాలి'

జగ్గంపేట, ఫిబ్రవరి 20: జగ్గంపేట, కిర్లంపూడి, గండేపల్లి మండలాల్లో విచ్చలవిడిగా తయారవుతున్న నాటుసారాను నిర్మూలించాలని బీజేపీ నేత అచ్యుత రామారావు జగ్గపేట సీఐకు వినతిపత్రం అందజేశారు. వలంటీర్లు, ఎస్ఈబీ పోలీసులు ఉన్నప్పటికీ దాన్ని అరికట్టడంలేదని పేర్కొన్నారు. కొన్ని గ్రామాల్లో సారాతో పాటు గంజాయి అమ్మకాలు జరుగుతున్నాయని, వాటిని పూర్తిగా నిర్మూలించాలని కోరారు.

లోకేశ్‌ను కలిసిన ఎమ్మెల్యే రాజప్ప



సామర్లకోట, ఫిబ్రవరి 20: తెలుగుదేశం పార్టీ పొలిట్ బ్యూరో సభ్యుడు, పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప మంగళవారం నర్సీపట్నంలోని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ శంఖారావం కార్యక్రమానికి హాజరై నారా లోకేశ్‌ను కలిసి మాట్లాడారు.